



జిల్లాలో మావోయిస్టుల ప్రభావం లేదు : జిల్లా ఎస్పీ బిందుమాధవ్


కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

కోటనందూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మావోయిస్టుల ప్రభావం లేదని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. గురువారం ఆయన కోటనందూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడారు. మావోయిస్టుల కదలికలపై ఇప్పటికే ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేశామన్నారు. ఈగల్ టీమ్ ద్వారా ప్రత్యేక నిఘా పెట్టామని, యువత పెడదోవ పట్టకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని తెలిపారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు ఇటీవల జరిగిన కేసులో పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. ఇటువంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. దొంగతనాల కేసులు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో గస్తీ ముమ్మరం చేశామన్నారు. ఎవరైనా ఇంటినుంచి బయటి ప్రాంతాలకు వెళ్తే స్థానికంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. జిల్లాలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తగ్గించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కేసులు తగ్గుముఖం పట్టాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు, కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాస్త ఉపశమనం

- 19కిలోల వాణిజ్య అవసర గ్యాస్ సిలిండర్ ధర రూ.10 తగ్గింపు
- తొమ్మిది నెలలుగా తగ్గిన వీటి ధరలు

సామర్లకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వాణిజ్య అవసరాలకు వినియోగించే 19కిలోల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలు రూ.10 తగ్గిస్తూ చమురు మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. సెప్టెంబరు 1నుంచి దీన్ని అమలు చేస్తున్నాయి. దీంతో పలు హోటళ్లు, రెస్టారెంట్లు వ్యాపార సముదాయాలు నిర్వహించే వారికి కాసింత ఉపశమనం కలిగిస్తోంది. గృహావసర గ్యాస్‌సిలిండర్ల ధరలు యథావిధిగా వసూలు చేసేలా నిర్ణయించారు. ఈ ఏడాది మార్చి నెల మినహా మిగిలిన తొమ్మిది నెలలూ 19కిలోల వాణిజ్యఅవసర గ్యాస్‌సిలిండర్ల ధరలు ఈ ఏడాది జనవరి 1నుంచి నిరంతరం తగ్గుతున్నాయి. జనవరి 1న దీన్ని రూ.14.50 తగ్గించగా దీని తర్వాత ఫిబ్రవరిలో రూ.7తగ్గించారు. మార్చిలో వీటి ధరలు రూ.6 పెరిగినా ఏప్రిల్‌లో రూ.41 వరకూ తగ్గించారు. దీని తర్వాత మే 1న రూ.14, జూన్ 1న రూ.24 చొప్పున తగ్గించారు. జూలై 1న వీటి ధరలను రూ.58.50 పైసల చొప్పున తగ్గించారు. దీనితర్వాత ఆగస్టు 1న మళ్లీ రూ.33.50 తగ్గించారు. నాలుగు నెలల తర్వాత సోమవారం నుంచి అమలయ్యేలా ఇప్పుడు తాజాగా డిసెంబరు 1 నుంచి రూ.10 తగ్గించారు. ప్రస్తుతం 19కిలోల వాణిజ్యావసర గ్యాస్ సిలిండర్ ధర రూ.1800గా ఉంది. అదే గృహావసర ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.905గానే ఉంది. గత ఏప్రిల్‌లో గృహావసర గ్యాస్ సిలిండర్ల ధరలు రూ.50 చొప్పున పెరిగినప్పటి నుంచీ వాటి ధరలు పెరగలేదు, తగ్గలేదు.



అక్రమ.. పరుగులు!

- లేఅవుట్ల క్రమబద్ధీకరణకు పరుగులు
- ఎల్ఆర్ఎస్‌కు 15598 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.127 కోట్ల రాబడి
- గత వైసీపీలో భారీగా అక్రమ లేఅవుట్లు
- చూసీచూడనట్లు వదిలేసిన అధికారులు
- కూటమి అధ్యయనం ..లబ్ధిదారులకు ఛాన్స్

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ పథకానికి అంచనాలకు మించిన స్పందన వ్యక్త మవుతోంది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు భారీగా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు 15,598 దరఖాస్తులు పోటెత్తాయి. దీన్ని బట్టి గత వైసీపీ సర్కారు హయాంలో ఏ స్థాయిలో అక్రమ లేఅవుట్లు పురుడు పోసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. మరోపక్క వచ్చిన ఎల్ఎర్ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.127 కోట్ల వరకు రాబడి రానుంది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 7,390 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రావడం విశేషం. వచ్చే నెల వరకు గడువు ఉండడంతో వీటి సంఖ్య మరింత పెరగనుంది.

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది జూలైలో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్ఆర్ఎస్) ప్రవేశ పెట్టింది. అనుమతుల్లేకుండా వేసిన లేఅవుట్లను ఈ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వాస్తవా నికి 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చింది. ఆ తర్వాత గడువు ముగియడంతో నిలిపివేసింది. అప్పట్లో వచ్చిన దరఖాస్తుల్లో 65 శాతం వరకు పరిష్కరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ అనుమతులు తీసుకోని అక్రమ భవనాలు, లేఅవుట్లు భారీగా పెరిగాయి. అప్పటి అధికార పార్టీ నేతలు, వారి అనుచరులు ఎక్కడికక్కడ అక్రమ లేఅవుట్లు వేసి విక్రయించి కోట్లు గడించారు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించు కోలేదు. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడద వోలు, రాజానగరం, కాకినాడ రూరల్ నియోజక వర్గాల్లో ఈ తరహా లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

నాటి ధరలే నేడూ..

అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం లేదు. దీంతో వారంతా లబోదిబోమన్నారు. ప్రభుత్వం మారాక వీటిపై అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ద్వారా వీటి క్రమబద్ధీకర ణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఏడాది జూన్ 30కి ముందు వేసిన లేఅవుట్లను ఈ పథకం కింద క్రమబద్ధీకరించు కోవడానికి ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. 2014- 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎల్ఆర్ఎస్‌లో నిర్దే శించిన బేసిక్ ధరలనే ఇప్పుడు నిర్ణయిం చారు. ఎల్ఆర్ ఎస్ అపరాధ రుసుముల కింద ప్లాట్ విస్తీర్ణం చదరపు మీటర్లలో 100 వరకు ఉంటే రూ.200,100-300 ఉంటే రూ.400, 300-500 వరకు రూ.600, 500పైన రూ.750 వరకు వసూలుకు నిర్ణయించారు. లేఅవుట్‌లో 10శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే జరిమానాతో పాటు ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి ఆ భూమి బేసిక్ విలువలో ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద 14 శాతం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. క్రమబ ద్ధీకరణ కింద ఫీజులు 45 రోజుల్లోగా చెల్లిస్తే 10 శాతం, 90 రోజుల్లోగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ప్రకటించింది. జూలైలో పథకాన్ని ప్రవేశపెట్టగా అక్టోబరు వరకు ప్రభుత్వం గడువిచ్చింది.తిరిగి వచ్చే నెల జనవరి 23వరకు పొడిగించింది.

'తూర్పు'న 7,390..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా తూర్పుగోదా వరి జిల్లా నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు భారీగా పోటెత్తాయి.జిల్లాలో డిసెంబరు 1 వరకు మొత్తం 7,390 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరి ధిలో 1,305, రుడా పరిధిలో 5,266, నిడదవోలు మునిసి పాలిటీ 291, కొవ్వూరు పరిధిలో 528 వచ్చాయి. మొత్తం 5,255 దరఖాస్తుల్లో 1,384 అప్రూవల్ అవగా 522 దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తుల ద్వారా ఎల్ఆర్ఎస్ ఆదాయం ప్రభుత్వానికి రూ.60.88 కోట్లు సమకూరనుంది. కార్పొరేషన్ పరిధిలో రూ.27.59 కోట్లు, రుడా ద్వారా రూ.25.78 కోట్లు జమకానుంది.

కాకినాడలో 5,839

కాకినాడ జిల్లాలో 5,839 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా రూ.44.71 కోట్లు ఆదాయం రానుంది. అత్యధికంగా కుడా పరిధిలో 4,327, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 316, ఉమ్మడి గుడాలో 305, గొల్లప్రోలు 55, పెద్దాపురం 115, పిఠాపురం 453, సామర్లకోట 58, తుని 149, ఏలేశ్వరంలో 59 చొప్పున వచ్చాయి. మొత్తం 5,839 దరఖాస్తుల్లో 2,780 అప్లికేషన్లకు ఆమో దం లభించగా 320 తిరస్కరించారు.

కోనసీమలో 2,369

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,369 దరఖాస్తులు వచ్చాయి. అమలాపురం మునిసిపాలిటీలో 437,అముడా 627, మండపేట 844, రామచంద్రపురం 182, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 279 చొప్పున వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 983 ఆమోదం పొందగా 89 తిరస్కరణకు గురయ్యాయి. కోనసీమ జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తుల ద్వారా రూ.21.45 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.ఉమ్మడి జిల్లా అంతా రూ.127 కోట్లు ఆదాయం సమకూరనుండగా ఇప్పటికే చాలా మంది అపరాధ రుసుములు చెల్లించడం ద్వారా సగానికిపైగానే వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

వేగవంతంగా..

- చురుగ్గా ఆర్టీజీఎస్ కేంద్రం పనులు
- పూర్తయితే మెరుగైన పాలనకు ఆస్కారం
- కలెక్టరేట్‌లో నూతన భవన నిర్మాణాలు
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎంతో ఉపయుక్తం


కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న ఆర్టీజీఎస్ కేంద్రం

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణాల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్టీజీఎస్) ప్రభుత్వ పాలనలో ఎంతో కీలకంగా ఉంది. జిల్లాకు సంబంధించిన సమగ్ర సమాచారం దీనిలో ఉంటుంది. తుఫాన్, ప్రకృతి వైపరీత్యాలు వంటివి సంభవించినప్పుడు ఆర్టీజీఎస్ ద్వారా విస్తృతంగా సేవలు అందిస్తారు. ఈ సెంటర్‌లో జిల్లా రియల్ టైమ్ గవర్నెన్స్, సీసీ టీవీ డేటా సెంటర్, ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించి జిల్లాస్థాయి నెట్‌వర్క్ సెంటర్, కలెక్టర్, ఎస్పీలు సమీక్షించడానికి సమావేశమందిరాలు నిర్మిస్తున్నారు.

ప్రధానంగా విపత్తులు, సంక్షేమ పథకాల విషయంలో రాష్ట్రస్థాయి ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వచ్చే సమాచారం ఆధారంగా అధికారులు పనులు చేస్తున్నారు. మొంథా తుఫాన్ సమయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లేకపోవడంవల్ల ఎక్కడికక్కడే అధికారులు విధులు నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే ఇక్కడినుంచి జిల్లాలో అన్నిమండలాల్లో అధికారులను తక్షణమే అప్రమత్తంగా చేయవచ్చు. జిల్లాలో ఉన్న 21 మండలాలతో ఈ కేంద్రం నెట్‌వర్క్ అనుసంధానం చేస్తున్నారు. జిల్లాలో పోలీసుశాఖకు 500వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటి అన్నింటినీ ఆర్టీజీఎస్ కేంద్రానికి అనుసంధానం చేస్తారు. ఇక్కడి నుంచే వీటి ద్వారా శాంతిభద్రతల పర్యవేక్షణ జరుగుతుంది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంను కలెక్టరేట్‌లో ఆర్టీజీఎస్ కేంద్రానికి అనుసంధానం చేస్తారు. జిల్లాలో 90 శాఖల ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. వీటి సమాచారాన్ని అంతా ఇక్కడ భద్రపర్చడానికి వీలు ఉంటుంది. అన్నింటిపై జిల్లా కలెక్టర్ నేరుగా పర్యవేక్షించే వీలు కలుగుతుంది.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం

కలెక్టరేట్‌లో నిర్మాణంలో ఉన్న ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణాలు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనికి నిధులు కేటాయించకపోవడం వల్ల ఆ పనులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం దీనివైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే ఉండిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీజీఎస్ కేంద్రం పనుల్లో ఇప్పుడు వేగం పెరిగింది. ఇది పూర్తయిన తర్వాత భారీ విపత్తుల్లోను ప్రాణనష్టం నివారించడం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

అక్టోబరు, నవంబరు నెలల్లో తుఫాన్లు

ప్రతిఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో తుఫాన్లు సంభవిస్తున్నాయి. దీనివల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురై తీవ్రనష్టం జరుగుతోంది. ఉద్యాన పంటలు ధ్వంసమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న ఆర్టీజీఎస్ కేంద్రం ద్వారా ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కోగలమని అధికారులు చెప్తున్నారు.

గ్రామ పంచాయతీల అనుసంధానంతో
ప్రజలకు మెరుగైన సేవలు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- కాకినాడ రూరల్‌లో డీడీవో కార్యాలయం ప్రారంభం


భవనం ప్రారంభోత్సవంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీలు రాజశేఖరం, పద్మశ్రీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అనుసంధానంతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై పర్యవేక్షణ జరిగి ప్రజలకు మరింత సుపరిపాలన అందించేందుకు వీలుంటుందని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట ఎంపీడీవో కార్యాలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన కాకినాడ డివిజినల్ అభివృద్ధి కార్యాలయాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీలతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు.ఈసందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్తూరు జిల్లానుంచి రాష్ట్రవ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీడీవోల రాకతో ప్రభుత్వ ఆదేశాలు సత్వరంగా క్షేత్ర స్థాయిలో చేరేలా దోహదం చేస్తాయన్నారు. డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ తదితర పీఆర్, గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన అన్ని విభాగాలను ఒకేచోట పనిచేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజినల్ అభివృద్ధి కార్యాలయాలు ప్రారంభించడం ద్వారా పవన్ నూతన శకానికి నాంది పలికారన్నారు. పీఆర్, గ్రామీణాభివృద్ధిశాఖ బలోపేతం కోసం పాలనలో సంస్కరణలు తీసుకొచ్చిన పవన్, ఒకే గొడుగు కిందకు ప్రభుత్వ శాఖలను తీసుకురావడం చారిత్రకమని ఎమ్మెల్సీలు రాజశేఖరం, కర్రి పద్మశ్రీ అన్నారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్, డీడీవో పి.వాసుదేవరావు, ఎంపీడీవో పసుపులేటి సతీష్ పాల్గొన్నారు.

ప్రాణాలతో..జలగాటం

- నిబంధనలకు 'నీళ్లు'
- నీటి నాణ్యత గాలికి
- అధికారుల పర్యవేక్షణలేమి

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)



స్వచ్ఛమైన నీటినే తాగాలి.దీనికి తగినట్టే ప్రస్తుతం జనం మినరల్ బాట పట్టారు. ఎంత ఖరీదైనా సరే ఆ నీటినే కొనుక్కొని మరీ సేవిస్తున్నారు. అయితే మనం తాగే నీరు నాణ్యమైనదేనా? అనే ఆలోచన చాలా మందికి ఉండడం లేదు. ఆర్‌వో వాటర్ ప్లాంట్ అని కనిపిస్తే చాలు.. అక్కడి నుంచే నీటిని కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. మరోవైపు నీటి వ్యాపారం బాగుండడంతో వీధికో ప్లాంట్ మాదిరి మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కాకినాడ జిల్లాలో ఇటీవల కాలంలో తాగు నీటి శుద్ధి ప్లాంట్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. 20 లీటర్ల బాటిల్ నీటిని పట్టుకోవాలంటే రూ.పది నుంచి మొదలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. వాస్తవానికి మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు గ్రామపంచాయతీ, పురపాలక నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని, విద్యుత్‌శాఖ కనెక్షన్ పొందాలి. ట్రేడ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్(బీఐఎస్), ఆహార కల్తీ నిరోధక, భూగర్భజల, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ఇవేవీ ఎవరూ చేపట్టడం లేదు. జలనాణ్యతను పరిశీలించే పరికరాలు, రసాయనాలు, మైక్రో బయాలజిస్టు, లేదా కెమిస్టులు ప్లాంటులో పని చేయాలి. స్టీల్‌డ్రమ్ములు, అంతర్గత పైపులైన్, ఏసీలు ఉపయోగించాలి. యంత్రాలకు వాడే ఫిల్టర్లను నెలకోసారి శుభ్రం చేయాలి. ప్రతి రోజూ టీడీఎస్ పరికరం ద్వారా నీటి సాంద్రతను పరిశీలించి నమోదు చేయాలి. కానీ ఇవి ఎక్కడా జరగడం లేదు. అనుమతులు తీసుకోవడం లేదు. అన్ని అనుమతులతో ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు రూ.50 లక్షల పైనే ఖర్చవుతుందని అంచనా. తూతూ మంత్రంగా ప్లాంట్లు ఏర్పాటు చేసి మినరల్ వాటర్ అంటూ ప్రజల ప్రాణాలతో జలగాటం ఆడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేమి ప్లాంట్ల నిర్వాహకులకు కలిసొస్తుంది. కొందరు ప్లాంట్ల నిర్వాహకులు వాటర్ క్యాన్లను సరిగా శుభ్రం చేయడం లేదు. మూడు నెలలు దాటితే ఆల్కలైన్ ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నా ఏళ్ల తరబడి పాతవాటినే వినియోగిస్తున్నారు. మూడు నెలలకోసారి మార్చాలనే నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. కాకినాడలో ఇటీవల పలు ఆర్‌వో ప్లాంట్లను నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ చేశారు. నీటి శాంపిళ్లను సేకరించి విశాఖకు పంపించగా...ప్లాంట్ల నిర్వహణ సరిగా లేదని తేలింది.

ఇలా తెలుసుకోవచ్చు..

తాగునీరు సురక్షితమో.. కాదో ఇలా తెలుసుకోవచ్చు. థర్మామీటర్‌ను పోలి ఉండే టోటల్ డిసాల్వ్ సాలిడ్స్(టీడీఎస్) పరికరం ద్వారా పరీక్షించవచ్చు. మార్కెట్లో ఇవి తక్కువ ధరకే లభిస్తాయి. టీడీఎస్ స్థాయిని పార్ట్స్ పర్ మిలియన్(పీపీఎం) స్థాయిలో లెక్కిస్తారు.


ప్రజారోగ్యానికి చర్యలు
అభినందనీయం

- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు మెరుగైన జీవన విధానాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై కేంద్రం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాసు అన్నారు. గురువారం లోక్‌సభలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన హెల్త్ సెక్యూరిటీస్ నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025పై ఆయన మాట్లాడారు. దీనివల్ల ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తుల వినియోగం గణనీయంగా తగ్గుతుందన్నారు.

రాష్ట్రంలో పర్యాటక రంగం
గణనీయంగా వృద్ధి

- ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



కాకినాడ సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో పర్యాటక రంగం గణనీయంగా వృద్ధి సాధించిందని రాజ్యసభలో ఎంపీ సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు గురువారం కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో దేశీయ పర్యాటకుల సందర్శనలు 2020లో కేవలం 7.08కోట్లు ఉంటే 2024లో 29.02 కోట్లకు పెరిగిందని ఆయన వెల్లడించారు. విదేశీ పర్యాటకుల సంఖ్య 2020లో 67,591 ఉండగా 2024లో 2.62 లక్షలకు చేరిందన్నారు. దేఖో అప్నా దేశ్ కార్యక్రమం, ఉత్సవ్ పోర్టల్ ద్వారా ప్రాచీన కళలు, సంగీతం, వంటకాలు, వస్త్ర కళలను ప్రోత్సహించే సాంస్కృతిక ప్రదర్శనలు, కూటమి ప్రభుత్వం చొరవ ఈ వృద్ధికి దోహదం చేశాయని ఎంపీ సతీష్ పేర్కొన్నారు.యూత్ హాస్టల్స్‌పై అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయ సమాధానమిచ్చారు.

నేడు మెగా పీటీఎం 3.0

- జిల్లావ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు
- తల్లిదండ్రుల దృష్టికి విద్యార్థుల ప్రగతి

మెగా పీటీఎం నిర్వహణకు రూ.33.42లక్షలు మంజూరు

కాకినాడరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)-3 నిర్వహణకు ప్రభుత్వం రూ.33.42 లక్షల బడ్జెట్ మంజూరు చేసిందని డీఈవో పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 1280 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని డీవైఈవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలను ఆయన ఆదేశించారు.

జీజీహెచ్ వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో..
విధుల నుంచి రీసెర్చ్ సైంటిస్ట్ తొలగింపు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎక్స్పైరీ అయిన కిట్లతో స్క్రబ్ టైఫస్, కొవిడ్, హెపటైటిస్ సహా పలు కీలకమైన వైద్యఆరోగ్య పరీక్షలు నిర్వహించిన కాకినాడ జీజీహెచ్ వీఆర్‌డీఎల్ ల్యాబ్ రీసెర్చ్ సైంటిస్ట్ డీవీ సురేష్‌బాబుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ సూచనల మేరకు రాష్ట్ర డీఎంఈ డాక్టర్ రఘునందన్ ఆదేశాలతో కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ విధులనుంచి తొలగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక విచారణలో భాగంగా వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో ఉన్నతాధికారులు నియమించిన విచారణ కమిటీ విచారణ చేపట్టిందని ప్రాథమిక ఆధారాలు లభ్యం కావడంతో తక్షణ చర్యల కింద సురేష్‌బాబును విధుల నుంచి తొలగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. లోతైన విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుది చర్యలు త్వరలో తీసుకుంటామన్నారు. త్రిసభ్య కమిటీలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశేఖర్, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీవాణి, అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీదేవి ఉన్నారు. విచారణ అనంతరం ఔషధ నియంత్రణ శాఖ బృందం ల్యాబ్‌లో తనిఖీలు చేపట్టింది. వారు ల్యాబ్‌లో కాలం చెల్లిన కిట్లను గుర్తించారు. అంతకుముందు డీఎంహెచ్‌వో నరసింహ నాయక్ ల్యాబ్‌ను సందర్శించారు. ఎక్స్పైరీ అయిన కిట్లతో పరీక్షల వివరాలపై ఆరాతీశారు.

వాకలపూడి సముద్రతీరంలో రసాయన వ్యర్థాలు 7
- ప్రమాదకరమైన కెమికల్స్ లారీని పట్టుకున్న మత్స్యకారులు
- కాకినాడ బీచ్‌రోడ్డులో ఆందోళన చేపట్టిన మత్స్యకారులు

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ 7

లారీ ఢీకొని భార్యాభర్తల మృతి

ఏఐ టూల్‌తో విద్యార్థుల సమగ్ర నివేదిక 6

ప్రకృతి నిలయం



డ్రాగన్ ఫ్రూట్ మొక్క

పంట పొలాల మధ్యలో అడుగుపెడితే పచ్చదనం కనువిందు చేస్తుంది. పక్షుల కిలకిలరావాలు... పండ్ల వాసనలు, ఆకుల చప్పుళ్లు... ఇవన్నీ కలగలిసిన ఆ మాయ జాలం పేరు ప్రకృతి నిలయం. డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన చిన్నం తేజారెడ్డి కేతారాజుపల్లిలో సృష్టించిన ప్రకృతి సీమ 12 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడి అతిథి గృహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సరదా కోసం ప్రారంభమైన ఈ పచ్చదన యజ్ఞం ప్రకృతి ప్రేమికులకు ప్రేరణగా నిలుస్తోంది.



- జీవ వైవిధ్యానికి నిలువెత్తు దర్పణం
- పంట పొలాల మధ్య పచ్చదనం
- రావులపాలెం మండలం కేతరాజుపల్లిలో చిన్నం తేజారెడ్డి స్ఫూర్తి కేంద్రం
- 12 ఎకరాల్లో 300 రకాల మొక్కల పెంపకం... గిరిజా కోళ్లు, బాతులు, ఆవులు కూడా...

(రావులపాలెం-ఆంధ్రజ్యోతి)

ఇక్కడ మొత్తం 300 రకాల మొక్కలను పెంచుతున్నారు. 30 రకాల మామిడి చెట్లు, 50 రకాల పండ్ల మొక్కలు ఉన్నాయి. ఇవికాక ఇతర జాతులకు చెందిన మొక్కలూ ఉన్నాయి. తైవాన్ జామ, దేశవాళీ జామ, రెడ్ పనస, వేప మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, పాల సపోటా, బత్తాయి, ఉసిరి, మారేడు, తామర పుష్పాలు, మల్బరీ, రేగు, జీడిగింజలు, యాపిల్, సపోటా... ఇలా అనేక రకాలు కనువిందు చేస్తున్నాయి. ఎటువంటి రసాయనాలను వినియోగించకుండా పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో పర్యావరణానికి మేలు చేసే విధంగా సహజ ఎరువులతో సాగు చేస్తున్నట్టు తేజారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.



సేంద్రియ పద్ధతిలో బంతి పూల సాగు




ప్రకృతి నిలయంలో కోళ్లు, బాతులు, వివిధ రకాల పక్షులు, ఆవు దూడ

కాగా ప్రకృతి నిలయంలో పక్షుల కిలకిలరావాలు ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. గిరిజా కోళ్లు, నాటుకోళ్లు, ఫ్యాన్సీ కోళ్లు, బాతులు, చిన్న ఆవులు, పుంగనూరు ఆవులు, కపిల ఆవులను కూడా ఇక్కడ పెంచుతున్నారు. పక్షుల కిలకిలలు, పండ్లవాసన మధ్య ప్రకృతిని ఆస్వాదించే వారికి ఇది ఒక స్వర్గధామం అని చెప్పవచ్చు. ఇక్కడ కాసిన పండ్లను పక్షులకే పెట్టడం తప్ప ఎటువంటి క్రయవిక్రయాలు జరపకపోవడం విశేషం.



బిలిమ్స్ ఫ్రూట్ మొక్క



రెడ్ పనస



తెనెటీగల పెంపకం తొట్టెలు



ప్రతిక్షణం ప్రశాంతం

పండ్ల తోటల మధ్య గడిపిన ప్రతి క్షణం మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ప్రకృతిపై ఉన్న మమకారంతో సుమారు పదేళ్లుగా మొక్కలను పెంచుతున్నాను. పక్షులను, జంతువులను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటాను. ఈ ప్రకృతి నిలయం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఇందులో పెరిగే మొక్కలను చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు.

చిన్నం తేజారెడ్డి, రావులపాలెం




పిఠాపురం పట్టణ శివారులో ఆరబెట్టి మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం రాశులు

గొల్లప్రోలులోని లేఅవుట్ ఖాళీ స్థలాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులు

ఆరబెట్టి... బండెనక బండి కట్టి...

దిత్వా తుఫాను ప్రభావంతో ఐదు రోజులుగా ఉన్న ముసురు వాతావరణం వీడింది. కాకినాడ జిల్లా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో ఎండ కాయడంతో వర్షానికి తడిసిన ధాన్యం రాశులను ఒకవైపు ఆరబెడుతూ, మరోవైపు ఆరిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపి ఎప్పటికప్పుడు ఎడ్ల బండ్లపై మిల్లులకు తరలిస్తున్నారు రైతులు. మరలా వాతావరణం మారినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇలా ఏర్పాటు చేసుకోవడంతో రహదారులపై ఎడ్లబండ్ల సందడి అధికంగా ఉంది. గురువారం ధాన్యం ఆరబెట్టి, బండెనక బండి కట్టి అనే రీతిలో తరలిస్తున్న దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- గొల్లప్రోలు/పిఠాపురం(ఆంధ్రజ్యోతి)



ఎడ్ల బండ్లపై ధాన్యం బస్తాలు వేసి మిల్లులకు తరలిస్తున్న దృశ్యం



మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులకు పూలంగి సేవ

జై గురుదేవ దత్త

పిఠాపురం పాదగయ, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి

పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న స్వయంభూ దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి గురువారం వైభవంగా జరిగింది. సప్తాహ మహోత్సవాల్లో చివరి రోజున దత్తాత్రేయునికి మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. సర్వ పుష్పార్చన, దతమూలమంత్రాలతో హోమం, పూర్ణాహుతి, అవబృదం జరిగాయి. సాయంత్రం స్వామికి ప్రత్యేక ఊయల సేవ జరిపారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఔదుంబర వృక్షం వద్ద, శ్రీపాదశ్రీవల్లభునికి పూజలు జరిపారు. గురుచరిత్ర పారాయణ, పూలంగి సేవ నిర్వహించారు. దత్తమాల ధరించిన భక్తులు ఇరుముడి సమర్పించారు. పాదగయ పుష్కరిణిలో దత్తాత్రేయుని తెప్పోత్సవం ఘనంగా జరిగింది. హంస వాహనంపై స్వామి విహరించారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ఉదయం మహా గణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్వికులచే మూలమంత్ర అనుష్టానం, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. దత్త మంత్ర హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. స్వాములకు వివిధ హారతులు, సాయంకాలార్చన జరిగాయి. రాత్రి దత్తాత్రేయస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు పూలంగి సేవ, బిల్వార్చన నిర్వహించి విశేషంగా అలంకరించారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది భక్తులు అధికంగా తరలివచ్చారు. దర్శనానికి కిలోమీటరు పొడవునా బారులు తీరారు. అన్నప్రసాద వితరణ జరిగింది. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాదగయలో స్వయంభూ దత్తాత్రేయస్వామికి నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో సౌజన్య



పాదగయలో ఇరుముడి సమర్పిస్తున్న దత్తస్వాములు



పాదగయ పుష్కరిణిలో దత్తాత్రేయ స్వామికి తెప్పోత్సవం

ఇకపై ఫిజియోథెరపీ కోర్సుకు నీట్

- దేశమంతా ఒకే సిలబస్
- వ్యవధి ఐదేళ్లకు పెంపు
- ఏపీఎస్‌పీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేష్‌బాబు రెడ్డి



సర్టిఫికెట్లు అందిస్తున్న జీఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ కోర్సులో ప్రవేశానికి 2026-27 సంవత్సరం నుంచి తప్పనిసరిగా నీట్ పరీక్షల్లో అర్హత సాధించాలని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ఫిజియోథెరపిస్ట్స్(ఏపీఎస్‌పీ)వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సురేష్‌బాబురెడ్డి వెల్లడించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కాలేజీల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ కోర్సుకు దేశమంతా ఇకపై ఒకే సిలబస్ ఉంటుందని, ఒకే రెగ్యులేటరీ సంస్థ ఏర్పాటవుతుందన్నారు. ఇప్పటి నాలుగేళ్ల ఫిజియోథెరపీ కోర్సు వ్యవధి ఐదేళ్లు పెరిగిందన్నారు. మందులు వాడకుండా కేవలం చేతులతో పేషెంట్లకు నొప్పి తొలగించే హీలింగ్ హ్యాండ్ ఫిజియోథెరపీ, జనరల్ ఫిజియోథెరపిస్టులు స్పెషలైజ్డ్ ఫిజియోథెరపిస్టులుగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ తమ కళాశాల ఇంటర్న్‌షిప్ విద్యార్థులు ఏడాది కాలంలో 12,390 మంది రోగులకు చికిత్స అందించారని, తెలుగు రాష్ట్రాల్లో ఇదే రికార్డని చెప్పారు. రాష్ట్రంలో ఫిజియోథెరిపీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ఏకైక సంస్థ జీఎస్ఎల్ అని అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ నిర్వహించిన ఎంపీటీ పరీక్షల్లో యూనివర్శిటీ స్థాయిలోని మొదటి మూడు ర్యాంకులు తమ విద్యార్థులే కైవశం చేసుకోవడం అరుదైన రికార్డుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథం, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు.


పోలవరం ఎల్ఎంసీతో అనకాపల్లికి గోదావరి జలాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వచ్చే పంట సీజన్ నాటికి పోలవరం ఎల్ఎంసీ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి జలాలను సరఫరా చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన తర్వాత పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 88శాతం పనులు పూర్తయ్యాయని, రూ.600 కోట్లతో ఎడమ ప్రధాన కాలువ పనులు జరుగుతున్నాయన్నారు.వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పోలవరం నిర్వాసితులకు పూర్తిగా పరిహారం చెల్లించి, కాలనీల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ అండ్‌ఆర్ కమిషనర్ పి.ప్రశాంతి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏఐ టూల్‌తో విద్యార్థుల సమగ్ర నివేదిక

ఫిజిక్స్ ఉపాధ్యాయుడి ఆలోచన.. మెగా పీటీఎం సందర్భంగా నేడు ఆవిష్కరణ

కరప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగించి విద్యార్థుల సమగ్ర నివేదికను వారి తల్లిదండ్రుల కళ్లకు కట్టినట్టుగా చూపించగలిగితే ఎలా ఉంటుందనే ఆ మాస్టారి ఆలోచన అందరి మన్ననలు అందుకుంటోంది. కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వీవీ రమణమూర్తి ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులందరి మార్కులు, హాజరు, ఇతర డేటాను గూగుల్ జెమిని అప్లికేషన్‌కు అనుసంధానించారు. ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై విద్యార్థి పేరు టైప్ చేయగానే విద్యార్థి ప్రగతికి సంబంధించిన సమస్త సమాచారం టెక్ట్స్ రూపంలో ప్రత్యక్షమవుతుంది. అప్పటి వరకు జరిగిన పరీక్షల్లో సబ్జెక్టుల వారీ మార్కులు, వెనుకబాటుకు గల కారణాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాలు, మెరుగుపరుచుకోవడానికి అవసరమైన సూచనలు, ఇలా అన్ని కోణాల్లో సమగ్ర నివేదికను అందజేస్తుంది. ఈ ఏఐ టూల్‌ను శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా ఆవిష్కరించనున్నట్టు రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎం అళ్ల సాయిమోహన్, ఎస్ఎంసీ చైర్మన్ నూకరాజు,సర్పంచ్ శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితరులు అభినందించారు.



ఏఐ ఇచ్చిన ఒక విద్యార్థి సమగ్ర నివేదిక, ఉపాధ్యాయుడు రమణమూర్తి

హాకీ పోటీల్లో విజేతలకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో మహిళల విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున హాకీ క్రీడలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారు. అలాగే పీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు బాలుర విభాగంలో హాకీ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున పాల్గొని ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం వీర్ని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరెన్నీ పోటీల్లో గెలుపొందాలని ఆకాంక్షించారు. జిమ్నాస్టిక్స్‌లో కె.శివగణేశ్ పాల్గొని ఆరు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు,ఒక విద్యార్థి వెండి పతకం సాధించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ డీఈవీవో శారద, ప్రిన్సిపల్ రాంబాబు, పీడీ రత్నసామ్యూల్, అధ్యాపకులు వర్మ, ప్రేమ్‌కుమారి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఎడారి దేశానికి.. హింసకు గురై ఇంటికి

- పేషెంటును చూసుకోవాలని తీసుకెళ్లి గొడ్డు చాకిరీకి పనిలో పెట్టిన వైనం
- తెలుగు ఏజెంట్ల దాష్టీకం
- 2 నెలలు తీవ్రంగా ప్రయత్నించిన భర్త
- పోలీసులు, లోకేశ్ ఆఫీస్ సిబ్బంది నిర్లక్ష్యం
- గత నెల 29న ఇంటికి చేరిన మహిళ

రాజమహేంద్రవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఎడారి దేశాల దారి పడుతున్న మహిళలు మోసకారి ఏజెంట్ల మాటల వలలో పడి పనిలో చేరిన తర్వాత పడరాని పాట్లు పడుతున్నారు. ఆ బాధను అధికారులు కూడా పట్టించుకోకపోవడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన ఎస్‌కేఎస్.బీబీ వ్యథ అటువంటిదే. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో 8 నెలల కిందట పాలకొల్లుకు చెందిన నాగరాజు అనే ఏజెంట్ ద్వారా బీబీ మస్కట్ వెళ్లింది. అక్కడ ఒక పేషెంటును మాత్రమే చూసుకోవాలని చెప్పారు.అక్కడకు వెళ్లాక రాజమహేంద్రవరానికి చెందిన ప్రియ అనే ఏజెంటు ఆఫీసు ద్వారా ఒక ఇంట్లో పనికి చేరింది. అయితే నాగరాజు చెప్పిన పని కాకుండా.. రోజూ 14 మందికి మూడు పూటలా వండి పెట్టడం, వాళ్ల దుస్తులు ఉతకడం, మూడు అంతస్తుల భవనాన్ని శుభ్రం చేయడం వంటి పనులు అప్పగించారు. దీంతో కొద్ది రోజులకే ఆమెకు నరకం కనిపించింది. అయినా ఉదయం 4గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ గొడ్డు చాకిరీ చేయాల్సి వచ్చేది. ఇదంతా భర్తకు చెప్పినా కొద్ది రోజుల తర్వాత సర్దుకుంటుందని అనుకున్నారు. కానీ పరిస్థితి రోజురోజుకూ ఇబ్బందిగా మారడంతో రెండు నెలల కిందట ఆమెను ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నాలు ఆరంభించారు. తొలుత చాగల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. తర్వాత కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. అక్కడ నుంచి మంత్రి లోకేశ్ కార్యాలయానికి సమాచారం వెళ్లడంతో..ఆ సిబ్బంది ఆమె భర్తకు ఫోన్ చేసి ఏజెంటు ఫోన్‌కి లైన్ కలిపాడు. ఆమెను ఇండియాకు పంపాలంటే రూ.1.5 లక్షలు ఇవ్వాలని ఏజెంటు డిమాండ్ చేశాడు.అంత ఇచ్చుకోలేనని తనకు పరిచయం ఉన్న వారి ద్వారా భర్త ప్రయత్నాలు చేయడంతో మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం రంగంలోకి దిగింది. దీంతో ఆమెను పంపడానికి గత నెల 28న విమానం టికెట్ కొన్నారు. అంతకు 4 రోజుల ముందు మస్కట్‌లోని ఏజెంట్ ప్రియ కార్యాలయానికి బీబీని తీసుకెళ్లి శారీరకంగా హింసించినట్టు ఆమె వాపోయింది. కొట్టి, బూటు కాలితో తన్ని 2 నెలల జీతం, మరికొంత సొమ్ము.. పిల్లల కోసం కొన్న చాక్లెట్లు, దుస్తులను గుంజుకున్నారని కన్నీటి పర్యంతమైంది. ప్రాణాలతో ఇంటికి వెళితే చాలనుకొని బీబీ ఆ బాధను పంటి బిగువున అదిమి పట్టుకొంది. చివరికి 29వ తేదీ ఉదయం ఇండియాకు చేరుకున్నారు. భర్తతో కలిసి ఆమె గురువారం కలెక్టర్ కీర్తిని కలిశారు.అక్కడ ఇంకా తమ వంటి వాళ్లు 12 మంది వరకూ హింస పడుతున్నారని, వాళ్లను రక్షించాలని బీబీ వేడుకొంది. మస్కట్‌లోని ఏజెంటు ప్రియ, పాలకొల్లుకు చెందిన నాగరాజుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విన్నవించింది.తన భార్య ఆరోగ్యం బాగుపడాలని లేదంటే తమ జీవితాలు నాశనమవుతాయని, ఇలా ఎవరూ మోసపోకూడదంటూ.. చివరికి కొంత సొమ్ము ఇచ్చే వరకూ ఆమెను పంపించలేదని.. ప్రాణాలతో ఇంటికి చేరదేమో అని ప్రతి క్షణం నరకం అనుభవించానని భర్త కన్నీళ్లు పెట్టుకున్నాడు.



బంధాన్ని బలపరుద్దాం..

మరో విద్యాపండుగకు పాఠశాలలు ముస్తాబయ్యాయి. శుక్రవారం మెగా పీటీఎం-3.0 సమావేశాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రులకు వారి పిల్లల పురోగతిని తెలియజేయడం. పాఠశాలల కార్యకలాపాల్లో వారిని భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా ఇప్పటి వరకూ నిర్వహించిన రెండు సమావేశాలు సత్ఫలితాలు ఇచ్చిన నేపథ్యంలో మూడవ సమావేశం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- నేడు మెగా పీటీఎం 3.0
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు
- తల్లిదండ్రుల దృష్టికి విద్యార్థుల ప్రగతి
- పాఠశాల నిర్వహణపై చర్చ
- ఉపాధ్యాయులు, పేరెంట్స్ మధ్య వన్ టూ వన్ మీటింగ్

తొండంగి/పిఠాపురం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల నడుమ బంధాన్ని బలపరిచి పాఠశాలలను మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో ఏర్పాటుచేసిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 1, 2లు విజయవంతం కావడంతో మూడో సమావేశాన్ని కూడా పూర్తి విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు చేపట్టింది. నేడు శుక్రవారం మెగా పీటీఎం 3.0ను నిర్వహించేందుకు పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ చేసింది. దేశంలోనే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నిర్వహణలో ఆదర్శవంతంగా నిలవడంతోపాటు గిన్నీస్‌రికార్డు సాధించిన నేపథ్యంలో ప్రస్తుతం జరిగే మెగా పీటీఎంలో మరిన్ని కొత్త అంశాలను విద్యాశాఖ జోడించింది. విద్యార్థులకు బోధనలో వినియోగించే ఎఫ్ఎల్ఎన్ కిట్లు, జాదూ పిఠారా పెట్టెలోని అభ్యసన సామగ్రితోపాటు ఉన్నత పాఠశాలల్లో సైన్స్, సోషల్ ఇతర అంశాల బోధనకు ఉపయోగించే బోధనా సామగ్రి అంతటితో ప్రదర్శన ఏర్పాటు చేసి వచ్చిన వారికి అవగాహన కల్పిస్తారు. ఈనెల 10వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ పేరెంట్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో ఈ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలలు, కళాశాలల పనితీరు, విద్యాబోధనలో పలు మార్పులు తీసుకువచ్చారు.

సమావేశాల నిర్వహణ ఇలా..

అన్ని పాఠశాలల్లో జరిగే సమావేశాలను ఏ రీతిలో నిర్వహించాలనే విషయంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మెగా పీటీఎం 3.0లో ప్రధానంగా విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తారు. గురువారం ఉదయం 9నుంచి 9.30గంటల వరకూ సమావేశానికి వచ్చే తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రముఖులు, అధికారులు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలి. పేరెంట్స్‌ను వారి పిల్లలుతో కలిసి క్లాస్‌రూమ్‌ల్లో కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలి.

- ఉదయం 9.30నుంచి 10.50గంటల వరకూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో క్లాస్ టీచర్ వ్యక్తిగతంగా సమావేశం కావాలి. ఇందులో ఇప్పటివరకూ జరిగిన సమ్మెటివ్, ఫార్మటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించి సబ్జెక్టుల వారీగా విద్యార్థులు రాసేందుకు ఇచ్చిన అసెస్‌మెంట్ బుక్‌లెట్లు చూపించి వారి ప్రగతిని వివరించాలి. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు గురించి తెలియజేయాలి. విద్యార్థి లేదా విద్యార్థినికి సంబంధించిన ప్రతి విషయాన్ని వారితో పంచుకోవాలి. వన్ టూ వన్ సమావేశాలు జరిగే సమయంలో తరగతి గదిలో ఉన్న తల్లిదండ్రులకు లీప్‌యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునేలా అవగాహన కల్పించాలి. వీడియోలద్వారా తల్లికి వందనం పథకం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్ గురించి వివరిస్తారు.
- 10.50 నుంచి 11గంటల వరకూ టీఎల్ఎం ఎగ్జిబిషన్, పాఠశాలలుకు అందించిన క్రీడా పరికరాలు, ఇతర వస్తువులు పరిశీలన, ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లు, విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ పరిశీలన ఉంటుంది.
- 11.10 నుంచి 12.45 గంటల వరకూ పాఠశాల విద్యాప్రగతి గురించి హెచ్ఎం నివేదిక, ప్రతిజ్ఞ, విద్యార్థులచే పద్యాలు, గేయాలు ఆలాపన, తల్లిదండ్రుల ప్రసంగాలు, పాఠశాల అవసరాలు, ఇప్పటి వరకూ దాతలు ద్వారా వచ్చిన విరాళాలు గురించి వివరణ, విద్యార్థుల ప్రశ్నల, జవాబుల ఓపెన్ సెషన్, విలువల విద్య, ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వందరోజుల ప్రణాళిక గురించి వివరణ తదితర అంశాలను నిర్వహించాలి.

విజయవంతానికి కసరత్తు

మెగా పీటీఎం-3.0 కోసం ముందుగానే విద్యా కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు సమావేశమై కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఆ రోజు విద్యార్థులందరూ తమకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు ద్వారా అందించిన యూనిఫారమ్, బూట్లు, సాక్సులు, బెల్టులు ధరించి హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులకు, ఇతర ప్రముఖులకు వ్యక్తిగతంగా విద్యార్థులు లేదా ఉపాధ్యాయులు ద్వారా ఆహ్వానాలు అందించారు. సామాజిక మాధ్యమాల్లో పాఠశాల గ్రూపుల్లో విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు సమావేశాల నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పాఠశాలలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. కనిష్ఠంగా రూ.900 నుంచి రూ.9,000 వరకూ నిధులు విడుదల చేసినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

పాఠశాలలు ఇలా

కాకినాడ జిల్లాలో 1,259 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, వాటిల్లో 51,256మంది విద్యార్థులు చదువుతుండగా, 104 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14,319మంది, 256 ఉన్నత పాఠశాలల్లో 97,387మంది విద్యార్థులు చదువుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1271 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత, 237 ఉన్నత పాఠశాలలు ఉండగా 1.42లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, తూర్పుగోదావరి జిల్లాలో అన్ని స్థాయిల పాఠశాలలు 973 ఉండగా, 89,085మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యా ర్థుల తల్లిదండ్రులు అందరూ మెగా పీటీఎంకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.



ఆకాశంలో కనువిందు

కాకినాడ బీచ్‌లో గురువారం సాయంత్రం ఆకాశంలో కనువిందు చేసింది. సూర్యాస్తమయంవేళ ఆకాశంలో నీలిమబ్బులు ఇలా కుంకుమవర్ణాన్ని సంతరించుకున్నాయి. మబ్బుల లోంచి వస్తూ ప్రకాశించిన సూర్యకాంతులు ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని కల్పించాయి. కాకినాడ ఉప్పాడ బీచ్ వద్ద ఈ సుందర దృశ్యాన్నిఆంధ్రజ్యోతి కెమెరా బంధించింది.

-ఫొటోగ్రాఫర్, కాకినాడ

చింతూరులో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా చింతూరులో గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారంతా మావోయిస్టుల చర్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. మావోయిజం వద్దు అభివృద్ధి ముద్దు అంటూ నినదించారు. రహదారుల పనులకు వినియోగిస్తున్న యంత్రాలను తగులబెట్టడం, ఇన్‌ఫార్మర్ల నెపంతో అమాయక ఆదివాసీలను హత్యచేయడం ఎంతవరకు సమంజసమని వారంతా మావోయిస్టులను ప్రశ్నించారు. మావోయిస్టుల చర్యల కారణంగా పలు మారుమూల గ్రామాల కు రహదార్ల సౌకర్యం, బస్‌సౌకర్యం కూడా లేకుండాపోయిందని వారంతా ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.



చింతూరులో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న గ్రామస్థులు

తప్పిపోయిన బాలుడిని క్షేమంగా అప్పగించిన పోలీసులు



తల్లి వద్దకు చేరిన బాలుడు ఏనాపు జగదీష్

సామర్లకోట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోలివారి వీధికి చెందిన ఏనాపు జగదీష్ అనే అయిదేళ్ల బాలుడు గురువారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన రింగ్ సెంటర్‌వద్ద ఉన్న సాయిబాబా ఆలయానికి అమ్మమ్మ శేషారత్నంతో కలిసి వచ్చాడు అమ్మమ్మ గుడిలోకి వెళ్లి తిరిగి బయటకు వచ్చి చూసేసరికి తన మనుమడు కనిపించకపోవడంతో ఆదుర్దాగా పరిసర ప్రాంతాలలో వెతికినా కనిపించలేదు. దీంతో సామర్లకోట సీఐ కృష్ణభగవాన్‌కు అందించిన ఫిర్యాదుతో పట్టణంలోని అన్ని సీసీ కెమెరాల సీసీ పుటేజీలను పరిశీలించి బాలుడు స్థానిక భీమేశ్వర స్వామి ఆలయం రోడ్డులో ఉన్నట్లు గుర్తించి బాలుడిని క్షేమంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీంతో అమ్మమ్మ శేషార త్నం, తల్లి శ్రీదేవిలకు క్షేమంగా పోలీసులు బాలుడు జగదీష్‌ను గురువారం సాయంత్రం అప్పగించారు. సామర్లకోట పోలీసులు చేసిన కృషిని ఎస్పీ బిందుమాధవ్, పెద్దాపురం డీఎస్పీశ్రీహరిరాజు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లాల అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 6వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్-17 బాలుర క్రికెట్ జట్టును ఉమ్మడిజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9గంటలకు స్థానిక క్రీడాప్రాంగణంవద్దకు చేరుకోవాలన్నారు. జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులు వారి వివరాలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కొండేపూడి ఈశ్వరరావు 9346920718, ఎస్.రమాదేవి 9440094984కు సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని భార్యాభర్తల మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- పుట్టిన మూడు నెలలకే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి



మృతిచెందిన దంపతులు లీలా ప్రసాద్, సౌమ్య(ఫైల్)

రాజానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-నరేంద్రపురం కూడలిలో లారీ ఢీకొని భార్యాభర్తలు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం నందరాడ గ్రామానికి చెందిన జుత్తుక లీలా ప్రసాద్ (20), రాజమహేంద్రవరం సమీపంలోని బర్మాకాలనీకి చెందిన సురేష్ సౌమ్య(21)తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి మూడు నెలల కిందట పాప కూడా జన్మించింది. లీలా ప్రసాద్ ఎలక్ట్రికల్ పనిచేసుకుంటూ భార్యను పోషించుకుంటున్నాడు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం బ్యాంకు పనినిమిత్తం ఇరువురు మోటారు సైకిల్‌పై రాజానగరం బయలు దేరారు. రాజానగరం-నరేంద్రపురం కూడలి వద్ద హైవే దాటుతున్న తరుణంలో రాజమహేంద్రవరం నుంచి వైజాగ్ వైపుగా వేగం గా, నిర్లక్ష్యంగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న లీలా ప్రసాద్, సురేష్ సౌమ్యలు లారీచక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే ఇదే ప్రాంతంలో మరో ఇద్దరు మహిళలను కూడా లారీ ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాల య్యాయి. గాదరాడకు చెందిన వెంకటలక్ష్మికి కుడికాలుకు బలమైన గాయాలుకాగా, సూర్య కుమారికి కుడికాలుకు మడమ నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను చికిత్సకోసం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మృతుల బంధువు సత్తిబా బు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటనపై రాయవరం పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంటూరు గ్రామానికి చెందిన చందాల వీరవెంకట సత్యనారాయణ(57) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 3న పని నిమిత్తం తన మోటారు సైకిల్‌పై తాళ్లపాలెం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా తాళ్లపాలెం-వెం టూరు రోడ్డులో ట్రాక్టర్, ఢీకొట్టిన ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిపై ఆధారపడి వృద్ధులైన తల్లిదండ్రులు, భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అసలెలా పంపించారు?

- మేనమామనంటూ నమ్మించి గురుకుల పాఠశాలనుంచి బాలికను తీసుకెళ్లిన ఓ యువకుడు
- సహకరించిన ఓ మహిళ
- మళ్లీ ఉదయం విడిచిపెట్టిన వైనం
- ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘటన
- ఆందోళన చేపట్టిన బాలిక బంధువులు
- పాఠశాల సెక్యూరిటీ, ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం
- కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కేసు నమోదు

మేనమామనంటూ నమ్మించి గురుకుల పాఠశాలనుంచి బాలికను ఓ మహిళ సహకారంతో ఓ యువకుడు తీసుకెళ్ళిన సంఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలోని ఓ సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఉదయం ఆ బాలికను విచిడిపెట్టాడు. దీంతో ఆ పాఠశాల సెక్యూరిటీ, ప్రిన్సిపాల్ ఎలా పంపించారని బా లిక బంధువులు ఆందోళన చేపట్టారు. అనంత రం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కింద కేసు నమోదు చేశారు.

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్ ఠాణేలంకలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మైనరు బాలిక (15)ను ఓ యువకుడు, మరో మహిళ బంధువును అని నమ్మించి ఆ పాఠశాల వసతిగృహం నుంచి తీసుకుపోవడంతో ఆ బాలిక బంధువులు గురుకుల పాఠశాలవద్ద గురువారం ఆందోళనకు దిగి పోలీసులను ఆశ్రయించారు. దీనికి సంబంధించిన బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని ఓ మైనరు బాలిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆ బాలిక తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుండగా తండ్రి పనులకోసం వేరే రాష్ట్రంలో ఉండడంతో ఆ బాలిక నాన్నమ్మ, తాతమ్మల వద్ద ఉంటూ గురుకుల పాఠశాలలో చదువుకుంటుంది. ఈ మేరకు కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో మోకా గిరిబాబు బుధవారం ఉదయం వసతిగృహానికి వచ్చి బాలికను ఆసుపత్రికి తీసుకువెళతానని చెప్పి పంపించమనగా గురుకుల పాఠశాలవారు నిరాకరించడంతో మరికొంత సేపటికి ఓ మహిళ తాను ఆ బాలిక మేనమామ భార్యను అని చెప్పి ఆసుపత్రి నిమిత్తం బాలికను గురుకుల పాఠశాల నుంచి తీసుకువెళ్లింది. అయితే బుధవారం సాయంత్రం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారద హాజరు పరిశీలనలో ఒక విద్యార్థి తక్కువగా ఉండడాన్ని గుర్తించి ఆ బాలికను ఇంకా పంపలేదని నాన్నమ్మకు ఫోన్ చేయగా తాను ఎవరినీ పంపలేదని, మనుమరాలు ఇంటికి రాలేదని చెప్పగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాఠశాల సెక్యూరిటీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.. అయితే మోకా గిరిబాబు గురువారం ఉదయం ఆ బాలికను గురుకుల పాఠశాల వద్ద వదిలి వెళ్లిపోయినట్టు సమాచారం. బాలిక నాన్నమ్మ, బంధువులు గురువారం గురుకుల పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టి పోలీసులను ఆశ్రయించారు. తాము గురుకుల పాఠశాల లోపలకు వెళ్లాలంటే సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారని, అటువంటిది బయటి వ్యక్తులను ఎలా పంపించారని, తన మనుమరాలను ఎలా బయటికి పంపారని ప్రశ్నించి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సెక్యూరిటీపై చర్యలు తీసుకోవాలని, తనమనుమరాలిని తీసుకువెళ్లిన గిరిబాబుపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాసాగర్ కేసు నమోదుచేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గిరిబాబు అతనిపాటు వచ్చి బాలికను తీసుకువెళ్లిన మహిళను అర్చనగా గుర్తించినట్టు తెలిసింది.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోపై విచారణ

- పది అంశాలతో కూడిన ప్రశ్నావళి
- వాదనలు విన్పించిన వైద్యులు

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. పుల్లయ్యపై ఉన్న ఫిర్యాదుల మేరకు గురువారం చింతూరులో విచారణ జరిగింది. ఇక్కడి ప్రాథమిక వైద్యశాలల్లో విధులు నిర్వర్తించిన, నిర్వర్తిస్తున్న పలువురు వైద్యాధికారులు డా.పుల్లయ్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం, ఆ మేరకు విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలో విజయవాడ నుంచి నేషనల్ ప్రోగ్రాం, ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపెయిర్ మెంట్ (ఎన్‌పీసీబీ అండ్ వీఐ) జాయింట్ డైరెక్టర్ డా. బి.సునీల్‌కుమార్ నాయక్ విచారణ అధికారిగా వచ్చారు. గురు,శుక్రవారాలు రెండురోజులపాటు విచారణ జరుగనుంది. డా.పుల్లయ్యపై ఫిర్యాదులు ఇచ్చిన వారిలో పదిమంది వైద్యాధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న డా. పుల్లయ్య విచారణ అధికారి ఎదుట హాజరయ్యారు. వారితో విచారణ అధికారి విడివిడిగా మాట్లాడారు. తమ వాదనను విన్పించేందుకు విచారణ అధికారి ఎదుట హాజరైనవారిలో ప్రస్తుతం చింతూరు డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇరువురు వైద్యాధికారులు ఉండగా, ఇక్కడ విధులు నిర్వర్తించి వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఎనిమిదిమంది వైద్యులు హాజరవడం గమనార్హం. కాగా వారందరికీ పది అంశాలతో కూడిన మూడేసి పేజీల ప్రశ్నావళి పత్రాలను విచారణ అధికారి అందించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఆయా ప్రశ్నావళికి ఆధారాలతో కూడిన సమాధానాలు నేడు తిరిగి విచారణ అధికారికి అందించాల్సి ఉంది. అదేదశలో డా.పుల్ల్యయ్య తనపై ఫిర్యాదులు చేసిన వైద్యాధికారులు విధి నిర్వహణ తీరు, ఆ మేరకు పలు అంశాలతో కూడిన ఆరోపణ పత్రాలను సిద్ధం చేసినట్లు వాటిని విచారణ అధికారికి శుక్రవారం అప్పగించనున్నట్లు సమాచారం. దీంతో విచారణ అధికారి గురువారం సాయంత్రం ఏడుగురాళ్లపల్లి, లక్ష్మీపురం, నెల్లిపాక గ్రామాలలో నేరుగా పలువురిని కలుసుకొని వైద్యాధికారులుఆరా తీసినట్లు తెలుస్తోంది. ఆంధ్రజ్యోతి విచారణ అధికారి డా.సునీల్‌కుమార్ నాయక్‌ను సంప్రదించగా విచారణ జరుగుతోందని, ఇది శాఖాపరమైన విచారణ కావడంతో విచారణలో తన దృష్టికి వచ్చిన అంశాలను బహిర్గతం చేయలేనన్నారు. పూర్తిస్థాయి విచారణలో తన దృష్టికి వచ్చిన అంశాలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

వాకలపూడి సముద్రతీరంలో రసాయనిక వ్యర్థాలు

- ప్రమాదకరమైన కెమికల్స్ లారీని పట్టుకున్న మత్స్యకారులు
- మత్స్య సందపకు హాని కలిగిస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి
- కాకినాడ బీచ్‌రోడ్డులో ఆందోళన చేపట్టిన మత్స్యకారులు

సర్పవరంజంక్షన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కాకినాడరూరల్ మండలం వాకలపూ డి-సూర్యారావుపేట సరిహద్దులోగల శాలోడి ప్రధాన డ్రెయిన్‌లో ట్యాంకర్ నుంచి తీసుకొచ్చిన రసాయనిక వ్యర్థాలను పైపులైన్‌ద్వారా డంపింగ్ చేస్తుండగా మత్స్యకారులు పట్టుకున్నారు. కొన్నేళ్లుగా ప్రమాదకర రసాయనిక వ్యర్థాలు తీసుకొచ్చి సముద్రంలో డంపింగ్ చేస్తుండడంతో మత్స్య సంపద అంతరించుకు పోతుందని, తక్షణమే సదరు కంపెనీ నిర్వాహకుడిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఉదయం వాకలపూడి బీచ్ రోడ్డులో శ్రీసాయి శ్రీనివాసా (ఎస్ఎస్ఎస్) ట్రేడర్స్ కంపెనీవద్ద వాకలపూడి హ ర్బార్‌పేట, సూర్యారావుపేట మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. మత్స్యకారుల ఆందోళనతో కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సర్పవరం పోలీస్‌స్టేషన్ సీఐ బి.పెద్దిరాజు, తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, మత్స్యశాఖ ఏడీ కరుణాకర్, పొల్యూషన్‌శాఖ అధికారులు చేరుకుని మత్స్యకారులతో చర్చించారు. ఈసందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఎస్ఎస్ఎస్ ట్రేడర్స్ కంపెనీ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి కరప మండలం పెద్ద కొత్తూరుకు చెందిన చింతా శ్రీనివాస్ లారీ ట్యాంకర్‌లో కెమికల్స్ వ్యర్థాలను తెలంగాణా, ఏపీల నుంచి తీసుకొచ్చి బీచ్‌రోడ్డులోగల సాలోడు ప్రధాన డ్రెయిన్‌లోకి పంపింగ్ చేస్తున్నాడని తెలిపారు. కంపెనీలో ఎటువంటి కార్యక్రమం జరక్కపోవడంతో ప్రధాన గేటుకి తాళంవేసి ఉంటుందని, రాత్రి సమయాల్లో కెమికల్స్ వ్యర్థాలతో రోజుకి సుమారు 3 ట్యాంకర్లు తీసుకొచ్చి, నేరుగా ఉప్పుటేరు, సముద్రంలో కలిసే విధంగా విడిచిపెడుతున్నారని ఆందోదళన వ్యక్తం చేశారు. ప్రమాదకర కాలుష్యకారక రసాయనిక వ్యర్థాలతో తీరంలో నిత్యం చేపపిల్లలు, తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయని, జీవనో పాధి దెబ్బతింటుందన్నారు. సముద్రంలో చేప పిల్లలుచచ్చిపోయి, తీరంలో రోజు దర్శనమి స్తున్నాయని వాపోయారు. గేటుకి తాళం వేయడంతో లోపల ఏం జరుగుతుందో బయటకు తెలియదని, ఈ లారీని పట్టుకు నేందుకు కాపలాకాయగా బుధవారం రాత్రి కెమికల్ వ్యర్థాలతో ఉన్న ట్యాంకర్‌ని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా అధికారులు వచ్చి లారీని సీజ్‌చేసి, షెడ్డులో ఉన్న ఆయిల్ డబ్బాల నుంచి శాంపిల్స్ తీసుకున్నారు. శాంపుల్స్ పరీక్షించిన తర్వాత నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామని, ప్రమాదకర కాలుష్య కారక వ్యర్థాలు తీరంలో డంపింగ్ చేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు మత్స్యకారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మత్స్యకారుల ఫిర్యాదు మేరకు చింతా శ్రీనివాస్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాల్సిందిగా తహశీల్దార్ కుమారి ఆదేశించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు.



కాకినాడ బీచ్‌రోడ్డులో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులు



శాంపుల్స్ సేకరిస్తున్న తహశీల్దార్ కుమారి, సీఐ పెద్దిరాజు

కాకినాడ

పాదగయ ఈవోకు దత్తస్వాముల సత్కారం

పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాదగయ క్షేత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహనశ్రీనివాస్‌ను గురువారం దత్తస్వాములు సత్కరించారు. దత్తాత్రేయ జయంతి సప్తాహ మహోత్సవాలు, దత్తస్వాముల ఇరుముడిధారణ, సమర్పణ తదితర సమయాల్లో కల్పించిన ఏర్పాట్లు, సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని స్వాములు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చేసిన ఏర్పాట్లకు కృతజ్ఞతగా ఈవోని సత్కరించినట్టు చెప్పారు.

'గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలి'



కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, గిరిజన రైతులు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం పరిమితడక గ్రామానికి చెందిన గిరిజన రైతులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు, శంఖవరం మండలం కొండ గౌరంపేట గ్రామ రైతులకు కొండపోడు పట్టాలు జారీ చేయాలని కోరుతూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. గురువారం ఆయన్ను రైతులు కలెక్టరేట్‌లో కలిశారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ దశాబ్దాలుగా పోడు వ్యవసాయం సాగిస్తున్న గిరిజనులకు ఇప్పటికీ భూమి పట్టాలు లభించకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. భూమి హక్కులు లేనందున ప్రభుత్వం అందించే పథకాలు, రుణాలు, వ్యవసాయ సదుపాయాలు పొందడంలో గిరిజన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీవనో పాధి, రక్షణ కోసం తక్షణం పట్టాలు జారీ చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వచ్చిన 200 మంది గిరిజనులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'పంట కాలువలు కలుషిత కాకుండా చర్యలు తీసుకోవాలి'



మత్స్య శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న గోదావరి డెల్టా చైర్మన్ సునీల్‌కుమార్

పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేపలు, రొయ్యల చెరువుల కారణంగా పంట కాలువలకు జరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన నీటి సంఘాల ప్రతినిధులతో కలిసి కాకినాడ జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. చేపలు, రొయ్యల చెరువుల నిర్వాహకులు మురుగునీటిని పంపింగ్ చేయడం వల్ల కాలువల సామర్థ్యం తగ్గిపోతోందని తెలిపారు. కాకినాడ జిల్లాలోని పలు గ్రామాల రైతులు ఈ విషయంపై తనకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. తక్షణం అనధికారిక పంపింగ్ ఆపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు సానా శ్రీనివాస్ (పెద్దాడ), ఎల్.కృష్ణచైతన్య (కాజులూరు), పుణ్యమంతుల సత్యనారాయణ (కరప), ఏఈఈలు వీరబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు ఘంటసాల స్థానం ఎప్పటికీ సుస్థిరంగా ఉంటుందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. సీతారామరాజు స్మారక కళా వేదిక ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని బాలాత్రిపుర సుందరి ఆలయం సెంటర్లో గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు, కర్రి నారాయణ, వడ్డాది సీతారామూర్తి, కర్రి భామారెడ్డి, వి.రంగారావు, చుండూరు పద్మ, ఎస్‌వీఆర్ బాపిరాజు, ఎస్వీ రమణ, పీపీ శాస్త్రి, భార్గవి, ఎ.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, కె.లక్ష్మణరావు, ఎం.శ్రీరాములు, కేవీ ప్రసాద్, బీహెచ్‌వీ వర్మ, కె.ఫుల్లారావు, టీవీ ఎస్‌ఎన్ రెడ్డి, వి.మురళి తదితరులు పాల్గొన్నారు. ఘంటసాల సంగీత కళాపీఠం గాయకుల స్వరార్చన అభిమానులను అలరించింది.

వెదురు సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు

పెద్దాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెదురు సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని తూర్పు గోదావరి జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని వాలు తిమ్మాపురంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వెదురు సాగుపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వెదురు పంట వేసిన తర్వాత రెండు సంవత్సరాల వరకు అంతర పంటలుగా అల్లం, పసుపు, అశ్వగంధ సాగు చేసుకోవచ్చన్నారు. ఉద్యాన శాఖాధికారి కటకం సత్య శైలజ మాట్లాడుతూ వెదురు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం మొక్కకు రూ.150 వంతున హెక్టారుకు రూ.60వేలు రాయితీ ఇస్తోందన్నారు. సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. వీహెచ్‌ఏ పద్మినీకుమారి, రైతులు సైనం సాల్మన్‌రాజు, పెంకే సత్యనారాయణ, వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): భూముల్లో ప్రధాన పంటగా లేదా గట్లపై వెదురును సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. చేబ్రోలులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో మూడో ఏడాది నుంచి 40వ సంవత్సరం వరకు ప్రతిఏటా కోత కోసుకుని ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి వై.సోమరాజశేఖర్ వ్యవసాయాధికారి రాజా, పతంజలి కంపెనీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, కామేష్, శ్రీనివాస్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని సీఆర్‌ఎంటీల వినతి

తాళ్లరేవు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు త్రినాథరావు, ఎంఈవో మంగాయమ్మకు సీఆర్‌ఎంటీలు గురువారం వినతిపత్రం అందజేశారు. వారికి యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు సంఘీభావం తెలిపారు. సీఆర్‌ఎంటీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తరాల మీరాసాహెబ్ మాట్లాడుతూ క్లస్టర్ విధానం రద్దుచేయాలని, ఎంటీఎస్ ఇప్పించాలని, కనీస వేతనం పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఎక్స్‌గ్రేషియాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సీఎంఆర్‌టీలు కాశి శ్రీనివాస్, మత్స రాజేంద్రప్రసాద్, రేవు మానస, జల్లి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య, డిప్యూటీ తహసీల్దారు పద్మజలకు సీఆర్‌ఎంటీలు వినతిపత్రాలు అందజేశారు. తమకు ప్రత్యేక జాబ్‌చార్ట్ అమలు చేయాలన్నారు. గతంలో అమలులో ఉన్న రవాణా భత్యం తిరిగి చెల్లించాలన్నారు.

'బాల్య వివాహ్ ముక్త్ భారత్'కి వంద రోజుల ప్రణాళిక

కలెక్టరేట్/కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా జగన్నాథపురంలోని అన్నవరం సత్యదేవీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బాలల చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి చైల్డ్ హెల్ప్ లైన్-1098 ప్రాజెక్టు జిల్లా కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధ చట్టం-2009 ప్రకారం బాల్య వివాహాలు నేరమని, ఎక్కడైనా అలాంటి ఘటనల సమాచారం తెలిస్తే వెంటనే పంచాయతీ, అధికారులకు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి తెలియజేయాలని కోరారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతకు బాల్య వివాహాలు పెద్ద అడ్డంకి అవుతాయన్నారు. పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ... 18ఏళ్లలోపు పిల్లలపై లైంగిక నేరాలకు కఠిన శిక్షలు ఉన్నాయని, విద్యార్థులు అపరిచితుల ఆశలు, ప్రలోభాలకు లొంగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సభ్యులు, కన్వీనర్ డాక్టర్ ఝాన్సీలక్ష్మి, సభ్యులు లీనా, స్వాతి, ప్రత్యూష, సుబ్బలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆడ శిశువుల భ్రూణ హత్యల వ్యతిరేక ఉద్యమం

కాకినాడ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధృతి ట్రస్టు, బ్లూ రైన్ హాస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఆడ శిశువుల భ్రూణ హత్యల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా నగరంలో విస్తృత ప్రచారం చేపట్టేందుకు ప్రత్యేక సందేశంతో కూడిన 50కి పైగా హోర్డింగ్‌లు, ప్రచార పోస్టర్లు సిద్ధం చేశారు. గురువారం వాటిని బ్లూ రైన్ హాస్పటల్ అధినేత డాక్టర్ ఎం.శుభశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధృతి ట్రస్ట్, బ్లూ రైన్ హాస్పిటల్స్ కలిసి నిర్వహిస్తున్న పీరినేటల్ ఆన్‌లైన్ తరగతులు రాష్ట్రవ్యాప్తంగా గర్భిణులు, ఆయా కుటుంబాలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. భ్రూణ హత్యల నివారణకు ధృతి ట్రస్టు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. డాక్టర్ శ్రావణి దుర్గ, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.









గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో దత్తాత్రేయస్వామి, లక్ష తులసి పూజలో పాల్గొన్న భక్తులు, సామర్లకోటలో విశేష అలంకరణలో దత్తాత్రేయుడు

ఘనంగా దత్త జయంతి

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో దత్తాత్రేయస్వామి జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. దత్త జయంతి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. వైఖానస ఆగమం ప్రకారం దత్తస్వాములతో విశ్వక్సేన పూజలు, ఆరాధన అభిషేకాలు, లక్ష తులసి పూజ నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. సాయంత్రం దత్త హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు సుమారు కిలోమీటరు పొడవునా బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దత్తాత్రేయస్వామిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు దర్శించుకుని పూజలు జరిపారు. అన్నప్రసాద వితరణకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పేరున రూ.20వేలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దొరబాబును శేషవస్త్రాలతో సత్కరించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్‌ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి దత్తాత్రేయస్వామిని దర్శించుకున్నారు. అన్నప్రసాద వితరణకు రూ.10వేలు, ఆలయానికి రూ.5వేలు విరాళం అందజేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం ఆవరణలోని దత్తాత్రేయుని మందిరం వద్ద దత్త జయంతి నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతుల ఆధ్వర్యంలో పండితులు మహంకాళి వెంకటరామమూర్తి వేదమంత్రోచ్చారణలతో దత్తాత్రేయుడిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. పుష్పార్చన జరిపి నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాసు-విద్యుల్లత దంపతులు ఆసీనులయ్యారు. మార్గశిర పౌర్ణమి సందర్భంగా ఆలయ ఆవరణలో కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి విగ్రహాన్ని పంచద్రవ్యాలతో అభిషేకించి పుష్పాలతో అలంకరించారు. కుమారరామ భీమేశ్వరాలయంలో దత్తాత్రేయునికి విశేష అభిషేకాలు, పుష్పార్చన జరిపారు. ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), సభ్యులు పాల్గొన్నారు. పిఠాపురం రోడ్డులోని క్షత్రియ సుభాన్‌సింగ్ మందిరంలో వేంచేసియున్న షిర్డీసాయిబాబా ఆలయంలో దత్తాత్రేయునికి విశేష అభిషేకాలు జరిపారు. సుమారు 300 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వేట్లపాలెం షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వాహకుడు గుమ్మళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో దత్త జయంతి నిర్వహించారు.

'సంస్కరణ ఫలాలు గ్రామీణులకు అందాలి'



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ, డీసీసీబీ చైర్మన్ బాబు

పెద్దాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు గ్రామీణులకు అందాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. రామారావుపేటలో ఏర్పాటుచేసిన డివిజనల్ డవలప్‌మెంట్ కార్యాలయాన్ని వారు గురువారం ప్రారంభించారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రసంగాన్ని వీక్షించారు. పంచాయతీలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించేందుకు సరికొత్త ప్రణాళికలు రూపొందించినట్టు వెల్లడించారు. ఆర్డీవో శ్రీరమణి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీడీవో మద్దిపట్ల శ్యామల, డీఎల్పీవో బాలామణి, ఎంపీడీవోలు కేవీ సూర్యనారాయణ, కరక హిమమహేశ్వరి, కూటమి నేతలు మొయిళ్ల కృష్ణమూర్తి, పొలమరశెట్టి సత్తిబాబు, కందుల విశ్వేశ్వరరావు, సింగన అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు పర్యటన



మ్యాన్‌హోల్‌ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనరు

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడను పూర్తిస్థాయిలో పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. గురువారం ఆయన పారిశుధ్య సర్కిల్-2 పరిధిలోని 4వ డివిజన్‌లో వెంకటనగర్-డీమార్ట్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీల్లో చెత్త వేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి ప్రజలు సహకరించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మొక్కలు పెరిగిన విషయాన్ని గమనించిన కమిషనరు వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పక్కనే ఉన్న భవనం వాటర్ ట్యాంక్ నుంచి నీరు ఓవర్‌ఫ్లో కావడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ సమీపం లో నీరు పడుతున్నట్టు గుర్తించి భవన యాజమానిని హెచ్చరించారు. తదుపరి డ్రైనేజీని మూసివేసి ఖాళీ స్థలాన్ని ఫిల్లింగ్ చేయడం గమనించిన ఆయన సంబంధిత యాజమానికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డెయిరీఫారం సెంటర్లో అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలతో మాట్లాడి నిర్వహణలో లోపాల వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా షెడ్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై సానుకూలంగా స్పందించారు. ఇన్‌చార్జి కమిషనరు మాట్లాడుతూ... నగరాన్ని స్వచ్ఛ కాకినాడగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పర్యటనలో అదనపు కమిషనరు కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజరు నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నర్సింగ్ విద్యార్థినికి ఆర్థిక సహాయం

పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మోహన్‌నగర్‌కు చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఎం.కల్యాణికి లిటిల్‌స్టార్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు అండగా నిలిచింది. ఎన్.రమ్య-చంటి దంపతులు రూ.15వేలు, దాతలు రూ.5వేలు సమకూర్చగా గురువారం ఆమెకు రూ.20వేలను చెక్కు రూపంలో ట్రస్టు ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకుడు కరుణరాజ్, గౌరవాధ్యక్షురాలు టి.రాధ, సభ్యురాలు కృపారాణి, డైరెక్టర్ బ్యూలా గ్రేస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భద్రరావు బాధ్యతల స్వీకారం

గొల్లప్రోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) సీఈవోగా మొగలి భద్రరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఈవోగా పనిచేసిన ఆదిరెడ్డి సూరిబాబు నవంబరు నెలాఖరున ఉద్యోగ విరమణ చేయడంతో ఈ నియమాకం జరిగింది. భద్రరావును జనసేన నాయకులు, రైతులు సత్కరించారు.

'వారిని మళ్లీ నియమించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో బదిలీ చేశారు. వారిని తిరిగి అదే పాఠశాలలో నియమించాలని విద్యార్థులు కలెక్టర్ షాన్‌మోహన్‌ను గురువారం కోరారు. విద్యార్థులను కులం పేరుతో దూషించారనే అభియోగంతో వారిని బదిలీ చేశారన్నారు. ఇంగ్లిష్, వ్యాయామ ఉపాధ్యాయులు తమను కులం పేరుతో దూషించలేదని కలెక్టర్‌కు విద్యార్థులు వివరించారు.

'బ్రెయిన్ ట్యూమర్‌కు మెడికవర్‌లో అధునాతన వైద్యం'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు

సామర్లకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్‌తో ప్రాణాపాయానికి గురైన ఒక వ్యక్తికి అత్యాధునిక రేడియోథెరపీ సాంకేతికతను వినియోగించి విజయవంతంగా చికిత్స నిర్వహించినట్టు పనసపాడులోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్ మాసపు మాట్లాడుతూ.... ఇటీవలి కాలంలో ఎం.అంబిక, కె.సరోజినిదేవి అనే ఇద్దరు మహిళలు తీవ్రమైన తలనొప్పి, కంటిచూపు సమస్యలతో తమ వద్దకు వైద్యం నిమిత్తం వచ్చారన్నారు. న్యూరాలజీ, న్యూరో సర్జరీ, రేడియేషన్ అంకాలజీ విభాగాల వైద్యులను కలిసి రోగి పరిస్థితిని అంచనా వేశామన్నారు. మెరుగైన చికిత్స అందజేశామన్నారు. సెంటర్ హెడ్ శుభాకరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ జాసన్‌ఇసాక్, క్యాన్సర్‌ను జయించిన ఇద్దరు రోగులు పాల్గొన్నారు.

విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి అకస్మిక తనిఖీలు

సామర్లకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి గురువారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మేధస్సును స్వయంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు అందుతున్న బోధనా తీరుపై సమీక్షించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఇంకా చదువులో వెనుకబడి ఉన్నవారిని గుర్తించి ముందంజలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని ఇన్చార్జి హెచ్‌ఎం అప్పారావుని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సమగ్రంగా వివరించారు. విద్యార్థుల నైతిక విలువలు కాపాడే విధంగా దైనందిన జీవితంలో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమీక్షించారు. పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం తప్పనిసరి పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేశారు. అంతకు ముందు ఆర్జేడీ నీలమ్మ చెర్వు వద్ద ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి చదవడం, రాయడంలో చిన్నారుల మేధస్సును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో పట్టపగలు పుల్లయ్య, హెచ్‌ఎం మనోజ్, ఉపాధ్యాయులు వున్నారు.

పోరంబోకు స్థలం కబ్జాకు యత్నంపై రైతుల ఫిర్యాదు

కరప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో వెల్లతూము వద్ద మురుగు కాలువ గట్టును చేర్చి ఉన్న రెవెన్యూ పోరంబోకు భూమిని ఒక వ్యక్తి కబ్జా చేస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. జడ్.బావారం, కొరుపల్లి, కరప గ్రామాలకు చెందిన పలువురు రైతులు గురువారం ఈ మేరకు తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేసి విలువైన పోరంబోకు భూమి కబ్జాకు గురి కాకుండా రక్షించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు అనిశెట్టి సత్తిబాబు, దెయ్యాల రాంబాబు మాట్లాడుతూ కరప గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పోరంబోకు భూమిలో పేరుకుపోయిన చెత్తను తొలగించి రాత్రి సమయాల్లో మట్టితో మెరక చేస్తున్నాడన్నారు.

ఇదేమిటని ప్రశ్నిస్తే బడ్డీ కొట్టు పెట్టుకుంటానని నమ్మించే ప్రయత్నం చేస్తూ కబ్జా ప్రయత్నాలు ముమ్మరం చేశాడన్నారు. లక్షలు విలువ చేసే స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. రైతులు నక్కా శ్రీనివాసరావు, సీహెచ్ గోవిందరాజులు, రెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

11న కొండెవరంలో మెగా ఉచిత వైద్య శిబిరం

కొత్తపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండెవరంలో ఈ నెల 11న పిఠాపురం కార్తికేయ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కార్తికేయ హాస్పటల్ అధినేత డాక్టర్ మొగిలి కాశీవిశ్వనాథ్ పేర్కొన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కర్రి దివ్య గర్భిణులకు అవసరమైన పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తారన్నారు. కొండెవరం, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



చండీ హోమం

పెద్దాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో చండీ హోమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 700 శ్లోకాలతో వేదపండితులు శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజ జరిపారు. సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఖాదీ-విలేజ్ బోర్డు డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని ఎస్‌ఎస్‌ఎస్‌వీ కల్యాణ మండపంలో గురువారం ఏపీ ఖాదీ-విలేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లికి చెందిన శిరంగు శ్రీనివాసరావు డైరెక్టర్‌గా ప్రమాణం చేశారు. ఆయనకు ఎమ్మెల్యే పంతం నానాజీ, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.



క్విజ్ పోటీలతో విజ్ఞానం

కాకినాడ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి విజ్ఞానం పెంపొందుతుందని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలు జరిగాయి. 170 పాఠశాలల నుంచి సుమారు 680 మంది హాజరయ్యారు. విజేతలకు సైకిళ్లు, ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. రిలయన్స్ సైట్ హెడ్ ఎల్.మురళీధర్, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శ్రీకారం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ 2వ డివిజన్‌లో జి కన్వెన్షన్ హాలు నుంచి వలసపాకల వరకు రూ.2.90 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ శంకుస్థాపన చేశారు. కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కూటమి నాయకులు గోపు వెంకటరమణ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, రంబాల వెంకటేశ్వరరావు, పుల్ల శ్రీరాములు, బోళ్ల కృష్ణమోహన్, రాందేవు సీతయ్యదొర, పాండ్రంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోండి

గండేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతు ల నెహ్రూ హాజరవుతారన్నారు. అలాగే మండల శాఖ అధికారులు హాజరవుతారని ప్రజలు తమ సమస్యలను ఈ ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో సత్యరెడ్డి తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు పంచాయతీ ప్రజలు

మోతుగూడెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గూడూరు పంచాయతీ పరిధి దేవరపల్లిలో చాలా ఏళ్లుగా కొనసాగుతున్న రాకపోకల సమస్యలను నివారించేందుకు గురువారం కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో సర్పంచ్ మడవి బుజ్జి, ఎంపీటీసీ సున్నం గౌరమ్మ, పీసా ఉపాధ్యక్షుడు కూర సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గొల్లు అమృతరావు, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలోనే పునరావాసం : తహశీల్దార్

కూనవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూనవరం మండలంలోని గిరిజనేతర పోలవరం నిర్వాసితులకు ఏలూరు జిల్లా తాడ్వాయిలోనే ప్రభుత్వం పునరావాసం కల్పిస్తున్నట్టు తహశీల్దార్ ధర్మేంద్ర తెలిపారు. గురువారం టేకుల బోరు నిర్వాసితులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది ప్రాధాన్యత గ్రామాల గిరిజనేతర నిర్వాసితులకు తాడ్వాయిలోనే పునరావాసం కల్పిస్తున్నట్టు చెప్పారు.

వెదురునగరంలో మానసా దేవి హోమం

అడ్డతీగల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతి సందర్భంగా గురువారం వెదురునగరంలోని శ్రీ శివసాయి భువనేశ్వరి ఆశ్రమంలో లోక కల్యాణార్థ సాయిరాం గురూజీ ఆధ్వర్యంలో శ్రీ మానస దేవి కాలసర్పదోష నివారణ ధ్యానవనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థివలింగానికి ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ మానస దేవి హోమం, శాంతి కల్యాణం జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు.

టీచర్లపై బోధనేతర ఒత్తిడి తగ్గించాలి

● యూటీఎఫ్ జిల్లా నాయకుడు పండా కృష్ణయ్య

ఎటపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై బోధనేతర ఒత్తిడి పనులు తగ్గించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు పండా కృష్ణయ్య తెలిపారు. గురువారం ఎటపాకలో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పలురకాల యాప్‌ల రూపంలో ఉపాధ్యాయులను పని ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఎటపాక మండలం నూతన యూటీఎఫ్ కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పి.విజయ్, కార్యదర్శిగా కల్లేటి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

రైతులకు మినీ కిట్లు పంపిణీ

ఎటపాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గన్నవరం, కృష్ణవరంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు మినీ కిట్లును పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు బొల్లా పుల్లయ్య చేతులమీదుగా అందజేశారు. గన్నవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఏడు క్వింటాల మినీ కిట్లు, కృష్ణవరం గ్రామ పంచాయతీ పరిధిలో 10 క్వింటాల మినీ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఏవో దుర్గా రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోలవరం గ్రామసభ

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చింతూరులో శుక్రవారం పోలవరం గ్రామసభ నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ శుభంనొక్వాల్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం సచివాలయ సిబ్బందితో చింతూరులో దండోరా వేయించారు. గిరిజనేతర నిర్వాసితులు పునరావాసం పొందేందుకు మూడు ఆప్షన్లను గ్రామసభలో ఇవ్వనున్నారు. ఆ మేరకు నిర్వాసితుడు తన అంగీకారంతో కూడిన పత్రాన్ని గ్రామసభలో అధికారులకు అందించాల్సి ఉంటుంది.

డీడీవో కార్యాలయాలు ప్రారంభం

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చింతూరులో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం (డీడీవో) కార్యాలయం గురువారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ పద్ధతిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించగా స్థానికంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీడీవో విజయకుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ప్రజలకు సత్వరమైన సేవలు అందించేలా డివిజన్ స్థాయిలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డీడీవో) కార్యాలయాలను డిప్యూటీ సీఎం పవన్ ఏర్పాటు చేశారు. గురువారం ఆయన రాష్ట్రంలో 77 డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. రంపచోడవరంలో డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవానికి ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిణి ఎం.సావిత్రి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఎంపీడీవోలు ప్రసాద్, లక్ష్మణ్, కుమార్, సాల్మన్‌రాజ్, కిషోర్, డిప్యూటీ ఎంపీడీవో వై.రాజు, ఉపాధి పథకం ఏపీవోలు పంచాయతీ కార్యదర్శి కామరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిమామిడి రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌వో దేవదానం

రంపచోడవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి రైతులు పూత దశలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి ఏ.దేవదానం తెలిపారు. దీనిలో భాగంగా గురువారం ఆయన సిబ్బందితో కలిసి సీతపల్లి, కన్నారం, బూరుగుబంద గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించారు. కొత్తగా చిగురు దశలో ఉన్న మొక్కకు థైమాక్సిన్ 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో లేదా మోనోక్రోటోపాస్ 1.6 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే గింజ దశలో ప్రిపోనోపాస్ 1 మాల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సబ్ అసిస్టెంట్లు అప్పలస్వామి, నూకరాజు, పి.నాగరాజు, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి



చంద్రబాబుకు మొక్కను ఇస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి అమరావతిలోని సెక్రటేరియేట్‌లో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల తన పర్యటనలో గుర్తించిన అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లల్లో విద్యార్థుల ఇబ్బందులు, సిబ్బంది కొరత, ప్రభుత్వ ఆసుపత్రులలో ఎస్టీ సెల్ ఏర్పాటు, గిరిజన యువతకు ఉద్యోగావకాశాల కల్పన, విద్య, వైద్య రంగాల్లో బలోపేతం, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారించాని కోరుతూ ముఖ్యమంత్రికి వివరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు సాధ్యం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల



యనమలతో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్యకర్తలు

తుని రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలందరూ ఏకాభిప్రాయంతో సమన్వయంతో పని చేస్తే సత్ఫలితాలు సాధ్యమవుతాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ ఆధ్వర్యంలో తొండంగి మండలం కోదాడ గ్రామం నుంచి పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమానికి యనమల హాజరై పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మెచ్చి పెద్దఎత్తున వైసీపీకి రాజీనామాలుచేసి టీడీపీలోకి చేరడం అభినందనీయమన్నారు. కార్యకర్తలందరూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రాను న్న ఎన్నికల్లో పార్టీ గెలుపు ఏకపక్షం అవ్వాలని సూచించారు. టీడీపీలో చేరిన వారిలో మడికి సూరిబాబు, వెంకటరమణ, దడాల అబ్బాయి, శ్రీను ఉన్నారు. కోదాడ గ్రామ టీడీపీ నాయకులు మూర్తి సింహాచలం, దడాల విజయబాబు, మూర్తి కృష్ణ, పాల్గొన్నారు.

తునిలో ఎస్పీ వార్షిక తనిఖీలు

తుని రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ బిందుమాధవ్ గురువారం సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు చేశారు. సర్కిల్ కార్యాలయానికి విచ్చేసిన ఎస్పీ ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వివిధ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పూర్వాపరాలు తెలుసుకున్నారు. త్వరితగతిన కేసులు పరిష్కరించాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలో 3 పోలీస్‌స్టేషన్‌లో కార్యకలాపాలపై పలుఅంశాలు చర్చించారు. అనంతరం సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, తుని పట్టణ సీఐ గీతారామకృష్ణ, ఎస్ఐలు విజయ్‌బాబు, పాపారావు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తునిరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ అన్నారు. దివ్యాంగుల దినోత్సవ వేడుకను పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన స్థానికులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. దివ్యాంగులకు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచినవారికి మండల టీడీపీ అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, తదితరులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గీతాదేవి, ఏవో ప్రసాద్ తదితరులు ఉన్నారు.

యనమల చొరవతోనే అభివృద్ధి

తునిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్.అన్నవరం పంచాయతీ శివారు రామకృష్ణానగర్ యనమల చొరవతోనే అభివృద్ధి పథంలో నడిచిందని ఆ ప్రాంత నాయకుడు బండారు లక్ష్మణరావు, సానా సూరిబాబు,నంబారు వెంకన్న, కలం చలపతిరావు స్పష్టం చేశారు. ఈ మేరకు రామకృష్ణాకాలనీలో మీడియాతో మాట్లాడుతూ యనమల సహకారంతోనే తమకాలనీలో అభివృద్ధి చెందిందన్నారు. తమ ఎమ్మెల్యే యనమల దివ్య అభివృద్ధి పనులు పూర్తి చేశారని మరో రూ.8లక్షలతో పనులకు ప్రణాళిక రూపొందించారన్నారు.

‘సీఆర్పీల ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలి’



వాటర్ ప్లాంటు ప్రారంభిస్తున్న యనమల రాజేష్

తొండంగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఆర్ఎంటీ (సీఆర్పీల) పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని క్లస్టర్ విధానం రద్దు చేయాలని తదితర డిమాండ్లతో సీఆర్పీలు గురువారం ఆత్మగౌరవ దీక్ష చేపట్టి అధికార్లకు వినతిపత్రాలు అందించారు. సీఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం పిలుపుమేరకు జిల్లా ఉపాధ్యక్షుడు వి.వీరప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో సీఆర్పీలు తహశీల్దార్, మండల విద్యా శాఖాధికారికి వినతిపత్రం అందించారు. ఉద్యోగభద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని, 5 సంవత్సరాల నుంచి పెరగని వేతనాలను పెంచాలని, గ్రాట్యుటీ, పింఛను సదుపాయం కల్పించాలని, డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలని, మరణించిన సీఆర్పీలకు 10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతోపాటు కుటుంబంలో కారుణ్య నియామకం కింద ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ ప్రకటించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో సుబ్బిరెడ్డికి, డిప్యూటీ తహశీల్దార్ వీరేష్ కు అందించారు. సీఆర్పీలు కృపాశీల, చిరంజీవి, మీరా సాహెబ్ ఉన్నారు.

తొండంగిలో తాగునీటి ప్లాంట్లు ప్రారంభం

మండల కేంద్రమైన తొండంగిలో గురువారం రెండు వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్లను టీడీపీ నేత యనమల రాజేష్ ప్రారంభించారు. ఒంటిమామిడి దివిస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సామాజిక బాధ్యతలో భాగంగా 32 లక్షల వ్యయంతో రెండు ప్లాంట్లు ఏర్పాటు చేసిందని సీనియర్ మేనేజర్ ఆర్.సుధాకర్ తెలిపారు. గంటకు వెయ్యిలీటర్ల శుద్ధి సామర్థ్యం గలిగిన ప్లాంట్ల ద్వారా 24 గంటలూ తాగు నీరు అందుతుందన్నారు. దీని నిమిత్తం ప్రజలకు అవసరమైన ఏటీడబ్ల్యు కార్డులు, నీటి కేన్లను దివిస్ సంస్థ తరఫున ఉచితంగా అందిస్తున్నామన్నారు. 49 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల ద్వారా శుద్ధ జలాలను అందించడంతోపాటు, 5 గ్రామాల్లో 75 లక్షలతో తాగునీటి ప్లాంట్లు ఏర్పాటుచేశామన్నారు. వీటిని ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో దివిస్ ప్రతినిధి బి.వాసుబాబు, గ్రామ కార్యదర్శి ఐ.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి మాజీ సీఎం రోశయ్య

● రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు



రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతిని జగ్గంపేట ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తవెంకటేశ్వరరావు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు ముఖ్యఅతిథులుగా హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్త కొండబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్య కులంలో పుట్టి ఉమ్మడి ఆంధ్రరాష్ట్రానికి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఏకైక వ్యక్తి రోశయ్య అని, ఆయన గవర్నర్‌గా కూడా సేవలు అందించారని ఆయన ఏ పదవి చేపడితే ఆ పదవికి ఎంతో వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, బోండా నూకబాబు, కొత్త శ్రీరామకృష్ణ (రాము), చిత్రపు బాబు, బొండా వీర సత్యవి. నాగసత్య, బొండాడ జగన్, పాబోలు స్వామి, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా ప్రత్యంగిరి హోమం

అన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో గురువారం పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ప్రత్యంగిర హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం నిర్వహించి ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి జపములు, పారాయణలు, నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డీఏ మంజూరుతో ఈవోకు అభినందనలు



ఈవో సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న దేవస్థానం ఉద్యోగులు

అన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు డీఏ, ఏరియర్స్ మంజూరుచేసిన దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావుకు గురువారం ఉద్యోగులంతా ఈవో కార్యాలయానికి వెళ్లి ఆయనకు పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో దేవస్థానం ఉద్యోగులందరికీ సుమారు రూ.30లక్షలు లబ్ధిచేకూరుతుందని దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తెలిపారు. కార్తీకమాసంలో సిబ్బంది అంతా కష్టపడి పనిచేశారని మరోసారి ఉద్యోగులను ఈవో అభినందించారు. కార్యక్రమంలో పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు కృష్ణారావు, ఎల్.శ్రీనివాస్, ఈఈలు నూకరత్నం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే



స్థలదాతను సన్మానిస్తున్న గ్రామస్థులు

గండేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):గండేపల్లి గ్రామంలో యాదవులపేటలో నీటీ ఇబ్బంది ఉందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి తెలియజేయగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అక్కడ మాసిన సత్యనారాయణ ఇంటి ఆవరణలో వారు స్థలం ఇవ్వగా అందులో బోరు కొట్టారు. ఈబోరును గురువారం రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు ప్రారంభించారు. స్థలదాత మాసిన సత్యనారాయణను సన్మానించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, ఆళ్ల సత్తిబాబు, సుంకవిల్లి రమేష్, పైల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం

గండేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలో మల్లేపల్లిలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద గురువారం గురు పౌర్ణమి సందర్భంగా భక్తుల సహకారంతో కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అరుణాచలేశ్వర ఆలయంలో పౌర్ణమి పూజలు

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డరోడ్డు వద్ద గల అపీత కుచాంబ అరుణాచలేశ్వర ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, పంచహారతులు ఇచ్చారు. అమ్మవారికి వివిధ రకాల పూలు, పండ్లతో నివేదన, లలిత సహస్రనామ పారాయణ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో కృతికా దీపోత్సవం నిర్వహించగా, ఈ దీపోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాచపల్లి పుష్కర కాలువ వద్ద ఉన్న దత్తాత్రేయ విగ్రహానికి దత్త జయంతి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు జరిపారు.

అడ్వకేట్ దేవికి జడ్జి గోపీనాథ్ అభినందన

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ సభ్యురాలు అడ్వకేట్ అవసరాల దేవిని గురువారం స్థానిక జడ్జి ఎల్.గోపీనాథ్ అభినందించారు. ఏలేశ్వరం నగర పంచాయతీ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా అవసరాల దేవి నియమితులు కావడంతో బార్ అసోసియేషన్ ఆమెను సన్మానించింది. అనంతరం స్థానిక జడ్జి గోపీనాథ్‌ను అవసరాల దేవి, బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈసందర్భంగా జడ్జి గోపీనాథ్ అడ్వకేట్ దేవిని అభినందించారు. కార్యక్రమంలో భారత్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, మాజీ అధ్యక్షుడు బుగత శివ, న్యాయవాదులు పాల్గొన్నారు.



కోటనందూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ చంద్రశేఖర్

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోండి

కోటనందూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లర్స్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వోలు జాగ్రత్తలు తీసుకోవాలని తుని వ్యవసాయశాఖ ఏడీ కె.చంద్రశేఖర్ అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో జగ్గఅప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాదీ బోర్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఖాదీ బోర్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారం గురువారం తాడేపల్లిలోని ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి, వైస్ చైర్మన్‌గా ప్రత్తిపాడుకు చెందిన కొమ్ముల కన్నబాబు, డైరెక్టర్లుగా యడ్లపల్లి సాంబశివరావు, పిరంగు శ్రీనివాస్, శిరీషా, గాంధీ దయాళ్‌లతో ఖాదీ బోర్డు సీఈవో కట్టా సింహాచలం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ సి.ఈశ్వర్, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన సుబ్బారెడ్డిసాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, టీడీపీ నాయకులు అమరాది వెంకట్రావు, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, మదినే వెంకన్న దొర, చెక్కపల్లి నవీన్, దోో నవీన్, మిరియాల శ్రీను పాల్గొన్నారు.

కొండపోడులకు పట్టాలు మంజూరు చేయాలి



కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, గిరిజనులు

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కొండపోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు, సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిమితడక, కొండగౌరంపేట తదితర గ్రామాల గిరిజన మహిళలు, సాగుదారులతో కలిసి ఎమ్మెల్యే గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టాల మంజూరుకు చర్యలు తీసుకుంటా నని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, టీడీపీ జిల్లా నాయకులు పర్వత సురేష్, సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసిన టీడీపీ నేతలు



కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీని కలిసిన టీడీపీ నేతలు

కోటనందూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్ స్టేషన్ తనిఖీ కోసం వచ్చిన ఎస్పీ బిందుమాధవ్‌ను గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు పోతుల సూరిబాబు ఆధ్వర్యంలో నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, డాక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, గెడ్డం కొండయ్యనాయుడు, దంతులూ శివబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఏలేశ్వరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణస్థాయిలో పరిపాలనను వేగవంతం చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం కొత్తగా డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నదని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం తిరుపతి నుంచి డిప్యూటీ సీఎం వర్చువల్ విధానంలో రాష్ట్రంలో పలు డీడీవో కార్యాలయాలను ప్రారంభించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని టీవీలో ఎమ్మెల్యే సత్యప్రభ, టీడీపీ నాయకులు వీక్షించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు, జ్యోతుల పెదబాబు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ఏలేశ్వరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ప్రతిభను చాటుతూ అందరికీ స్ఫూర్తి కావాలని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవితా కేంద్రంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆట వస్తువులు, బొమ్మలు, క్రీడలు తదితర అంశాల్లో విజేతలకు ఎమ్మెలే బహుమతులు అందజేశారు. ఎంఈవో వరలక్ష్మీ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, పెంటకోట మోహన్, ఎంపీటీసీ పసల సూరిబాబు, కొప్పుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సీఆర్పీ సంఘ నేతల వినతి

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఆర్పీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఆర్పీలు స్థానిక డిప్యూటీ తహశీల్దార్ కె.పుణ్యవతి, ఎంఈవోలు వి.రాజబాబు, వై.అచ్చిరాజులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు గంగాధర్, సీఆర్ఎం సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

సీఆర్ఎంటీలకు వేతనాలు పెంచాలి

శంఖవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఆర్ఎంటీలకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని తహశీల్దార్ ఎ.తాతారావుకు గురువారం ఎంఈవో ఎస్వీ రమణ వినతిపత్రం అందజేశారు. ఏ, బి క్లస్టర్ విధానం కాకుండా ఒకే క్లస్టర్‌గా లోకల్ ప్రాధాన్యత కొనసాగించాలన్నారు. సీఆర్ఎం టీలు టెట్, బీఎడ్ అర్హతతో పని చేస్తు నందున డీఎస్సీలో వేయిటేజ్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు.

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయంలో గురువారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలపై అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ప్రత్తిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.24 లక్షలు మండల పరిషత్ నిధులు కేటాయించినట్లు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ తెలిపారు గజ్జనపూడి, ధర్మవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. గజ్జనపూడిలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బలక్ష్మితో కలిసి రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. గజ్జనపూడిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.9 లక్షలు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.6 లక్షలు, ధర్మవరంలో డ్రైనేజీ నిర్మాణానికి రూ.9 లక్షలు మండల పరిషత్ నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొనగాల అప్పలరాజు, బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కుమ్మరి శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అనకాపల్లి నూకరాజు, ఎంపీటీసీలు జువ్వల సుజాత బాబులు, మొల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.